# స్వప్నం రాల్చిన అమృతం

వెన్నెల మంచులా కురుస్తోంది. ఆ తెల్లటి తెరల నడుమ వీధి దీపాలు గుడ్డిగా ఉన్నాయి. ఏడు గంటలకే తొమ్మిదైనట్లుగా ఉంది. వీధుల్లో జనసంచారమూ తగ్గింది. ఉండి ఉండీ కార్లు, స్కూటర్లు ఎదురొస్తున్నాయి. చుట్టూ మేడలు, మేడల కిటికీలల్లోనుంచి తెల్లటి వెలుగు. దూరంగా ఎత్తు గుట్టల మీద నక్షత్రాల్లా మినుకు మినుకుమంటున్న దీపాలు.

రాజారామ్ తెల్లటి చొక్కా మీద కాఫీరంగు స్వెట్టర్ వేసుకున్నాడు. తన కుడివైపు డోరు అద్దం తప్ప అన్నీ మూసేశాడు. జీబూతాల్లా ముసిరివున్న చెట్ల కిందగా, నల్లటి తారురోడ్డు మీద మారుతిని నిశ్శబ్దంగా తీసుకు వెళుతున్నాడు- పెట్టుకున్న కళ్ళజోడులోనుంచి ఎక్కువసేపు రోడ్డు మీదకూ, ఆపైన రెండు నిముషాలకోసారి పక్కనే ఉన్న సావిత్రి వంక చూస్తూ.

ఆమెను చూస్తుంటే అతడి కళ్ళు చాలా తృప్తిగా మెరుస్తున్నాయి. "ఇన్నాళ్ళబట్టీ నువ్వు కనబడకపోవడం నా దురదృష్టం" అన్నాడు చిన్నగా నవ్వి.

లిప్‌స్టిక్ రంగులో తడిసినట్లున్న సన్నటి పెదాలను పొడుగుచేసి, నవ్వీ నవ్వనట్లుగా నవ్వింది సావిత్రి- నువ్వు ఎవరో ఒకరికి రోజూ ఇలా చెబుతూనే ఉంటావులే అన్నట్లుగా.

"ప్రామిస్!" అన్నాడు.

ఒక్కక్షణం ఆమె కళ్ళు గర్వంగా మెరిసినయ్. అసలే పెద్ద కళ్ళు. ఆపైన సన్నగా పెట్టుకున్న కాటుక. ఆయన మాటలకు అవి కొద్దిగా విశాలమైనాయి.

"నమ్మవా?"

ఆమె చెవులకు పెట్టుకున్న పొడుగాటి జూకాలు- ఈ మాటలు నేను రోజూ వినేవే అన్నట్లుగా అటూ ఇటూ ఊగాయి.



పి.ఎస్.నారాయణ

ఆమె లేతరంగు గులాబీ చీర కట్టుకుంది. అదే రంగు జాకెట్టు వేసుకుంది. పొడువాటి జుట్టును వదులుగా జడగా అల్లుకుంది. కుడివైపుగా చిన్న గులాబీ పెట్టుకుంది.

అతడు కారును పోనిస్తూనే స్టీరింగ్ వెనుకగా వున్న సిగరెట్ పెట్టెను తీసుకొని, కారును స్లోచేసి ఓ సిగరెట్ తీసుకొని, లైటర్ వెలిగించి, ఆమె వంక ఓరగా చూస్తూ, "నీకు అభ్యంతరం లేదు గదా!" అన్నాడు.

'నాకు దేనికీ అభ్యంతరం లేదు' అన్నట్లుగా చిన్నగా తల ఊపింది సావిత్రి.

"థాంక్యూ!"

కారు ముందుకు పోతూనే ఉంది. ఎప్పుడోగాని ఓ మనిషి కనబడటంలేదు. ఎలాంటి వాహనాలూ ఎదురుబడటం లేదు. ఇళ్ళు పలచబడి ఖాళీ స్థలాలు ఎక్కువవుతున్నాయి. మధ్య మధ్యలో మనిషి శరీరం మీద కణుతుల్లా పెద్దపెద్ద ఇళ్ళు.

"చాలా దూరమా?"

"ఎంత దూరమైతేనేం? నిన్ను ఇంటి దగ్గర దిగబెట్టే బాధ్యత నాదేనన్నాను గదా! అవునూ, ఇల్లెక్కడ?"

చెప్పింది సావిత్రి.

"డోన్ట్ వర్రీ!"

అప్పటికి ఆ కారు బయల్దేరి అరగంట అయింది.

చాలారోజుల తరువాత వజ్రంలా మెరుస్తున్న ఓ అమ్మాయి సావిత్రి రూపంలో సాక్షాత్కరించింది తనకు. ముందు సావిత్రిని పరిచయం చేసిన శంకర్రావుకు కృతజ్ఞతలు చెప్పుకోవాలి. 'మంచి కుటుంబంలోనుంచి వచ్చిన అమ్మాయి గురూ. ఏదో అనుకోని పరిస్థితులలో అలా అయిపోయింది. బాగా తెలిసినవాళ్ళయితే గాని రాదు. కాస్త రేటెక్కువ' అన్నప్పుడు 'బోడి డబ్బు ఎంతకావాలో చెప్పు. నాకు గనుక ఆ అమ్మాయి నచ్చితే నీవన్నదానికి అంత కలిపి ఇచ్చేస్తాను' అని తను నవ్వాడు.

అతడు చెప్పినట్లే చాలా బాగున్నది సావిత్రి. కొత్తగా ఈ వృత్తిలోకి దిగిన దానిలా– 'ఎంత' అంటే– 'మీ ఇష్టం' అన్నట్లుగా నవ్వేసింది. కారెక్కమన్నాడు. ఎక్కేసింది శంకర్రావు వంక ఒకసారి చూసి అతడు తల ఊపగానే.

ఏడు గంటలపైన నలభై నిముషాలు అవుతుండగా ఓ రెండంతస్తుల మేడ ముందు ఆగింది మారుతి.

ముందు రాజారామ్ దిగాడు. వెనగ్గా సావిత్రి దిగి తలవంచుకు నిలుచుంది.

"మీరొక్కరేనా ఉన్నది ఈ ఇంట్లో?"

"నేనే విషయమూ ఎవ్వరితోనూ షేర్ చేయను. డోన్ట్ వర్రీ!" అన్నాడు కాస్త గర్వంగా. "అంత పెద్ద కంపెనీకి గూడా నేనొక్కడినే సొంతదారుణ్ణి!"

అతడి మాటలకు కాస్త ఇబ్బందిగా చూసింది ఆమె.

అతడు అలవాటుగా తన మెత్తటి బూట్లతో మెట్లెక్కాడు. తడబడే కాళ్ళతో ఆమె అతడిని అనుసరించింది.

పెద్ద హాలు. సోఫాలు. గోడవారగా అందమైన రంగు రంగుల పూల కుండీలు. పైన వేలాడుతున్న తెల్లటి షాండ్లియర్. గోడలకు నాలుగు వైపులా విలువైన దీపాలు. చెడిన మనిషి ఉజ్జ్వలంగా బతుకుతున్నప్పుడు వెలిగే వెలుగులా అందమైన కార్పెట్.

'బాగా డబ్బున్న మనిషే' అనుకుంది సావిత్రి.

మేడమెట్లెక్కాడు. పాలరాతి అందం అరుగుతుందేమోనన్నట్లుగా పల్చటి పట్టులాంటి పట్టా మెట్లను కప్పివేసింది.

ఇలాంటివాడికి ఈ అడ్డదారులు దేనికో అర్థం కాలేదు సావిత్రికి. వయసు నలభై అయిదు ఉండవచ్చు. కాస్త నలుపైనా హుందాగా ఉన్నాడు. ఆరోగ్యంగా ఉన్నాడు. మంచివాడులా ఉన్నాడు. ఆపైన డబ్బులు విచ్చలవిడిగా ఖర్చు పెట్టి, కావలసిన ఆనందాన్ని కొనుక్కునే మనిషిలా ఉన్నాడు.

సావిత్రి అతడిని అనుసరిస్తోంది. ఒక గది దాటారు. మరో గది దాటుతుండగా 'అమ్మా' అన్న మూలుగు వినబడింది. సావిత్రి ఉలిక్కిపడ్డట్లుగా భయంభయంగా మూసివున్న ఆ తలుపుల వంక చూసింది. రాజారామ్ ఆ మూలుగును పట్టించుకోనట్లుగా ముందుకు అడుగులు వేశాడు. పక్కగది దగ్గరకు వెళ్ళి దగ్గరకు వేసివున్న తలుపులను వెనక్కు నెట్టాడు.

"లోపలకు రా."

సావిత్రి లోపలకు అడుగు పెట్టింది. పక్క గదిలోనుంచి విన్న ఆ స్త్రీ మూలుగును మరిచిపోలేనట్లుగా ఒక్కసారి కళ్ళు మూసుకు తెరిచింది.

అందమైన కింద హాలు వెలాతెలా బోయేలా ఉంది ఆ బెడ్‌రూమ్. ఖరీదైన రెండు మంచాలు. వాటి మీద మల్లెపువ్వుల్లాంటి తెల్ల దుప్పట్లు. గదంతా పరిచిన లేత నీలంరంగు

కార్పెట్. గోడలకు వేసిన లేత నీలంరంగు. తెల్లగా వెలుగుతున్న ఫ్లోరోసెంట్ దీపం. మంచానికి ఓ పక్కగా రెండు సోఫాలు. టీపాయ్. దానిమీద సీసాలు. గాజు గ్లాసులు. ఐస్‌క్యూబ్స్ ప్యాక్...

బహుశః ఈయన ఇప్పుడు తాగుతాడేమోగూడా అన్నట్లుగా ఆయన వంక చూసింది సావిత్రి. తనలాంటి వాళ్ళు ఇంకా లేరు గదా పక్క గదుల్లో. తెలియాలి. ఎవరిదో ఆ బాధాకరమైన కంఠం. అయినా శంకర్రావు ఇబ్బందుల్లో పడేయడనే నమ్మకం తనకుంది.

"స్నానం చేస్తావా? గీజర్ ఆన్ చేసే ఉంది."

అక్కర్లేదన్నట్లుగా తల ఊపింది సావిత్రి.

"మాక్సీ కావాలా? ఇస్త్రీ చేసినవి ఆ అలమారాలో ఉన్నాయి!"

"వద్దు."

"డోన్ట్ వర్రీ. బీ ఫ్రీ! నేను రెండు నిముషాల్లో ఫ్రెషప్ అయి వస్తాను" అంటూనే స్వెట్టర్ విప్పాడు. అలమారాలో నుంచి ఉతికిన తెల్లటి టర్కీటవల్ తీసుకొని బాత్‌రూమ్‌లోకి వెళ్ళాడు.

సావిత్రి తీసి ఉన్న తలుపుగుండా బాల్కనీలోకి వచ్చింది. అది పక్క గదికీ, దీనికీ గూడా కలిపి ఉన్న బాల్కనీ.

ఆ గదిలోనుంచి ఎవరినో బాధగా పిలుస్తున్నట్లుగా స్త్రీ కంఠం. అటు వెళ్దామా అన్నట్లుగా ఆవేశంగా ఓ అడుగు వేసింది. కానీ, తను హద్దు మీరినట్లవుతుందేమో నన్నట్లుగా సంశయిస్తూ ఆగిపోయి వెనక్కు తిరిగింది– బాత్‌రూమ్ తలుపు తెరుస్తున్న చప్పుడవ్వడంతో.

రాజారామ్ బయటకు వచ్చాడు తువ్వాలతో ముఖం తుడుచుకుంటూ. "కూర్చో సావిత్రీ!" అన్నాడు.

ఆమె నిశ్శబ్దంగా, అతడిని అర్థం చేసుకోవాలి అన్నట్లుగా ఒక్కసారి అతడి కళ్ళల్లోకి చూసింది.

"నేను నిలబడి నీళ్ళు తాగే మనిషిని!"

సావిత్రి మౌనంగా లోపలకు వచ్చింది. సోఫాలో కూర్చోవాలా, మంచం మీద కూర్చోవాలా అన్నట్లుగా ఒక్క క్షణం తటపటాయించి, సోఫాలో కూర్చుని భుజాన ఉన్న వ్యానిటీ బ్యాగ్‌ను తీసి పక్కన పడేసింది.

"బాగా చలిగా లేదూ?" అన్నాడు రాజారామ్ ఆమెనే తినేస్తున్నట్లుగా చూస్తూ దగ్గరికల్లా వచ్చి.

"బాల్కనీ తలుపు వేయమంటారా?"

"డోన్ట్ వర్రీ. ఓ పెగ్ వేసుకుంటే ఎలా ఉంటుందీ అనేది నా ఆలోచన. నీకేమైనా అభ్యంతరమా?"

'లేదు' అన్నట్లుగా తల అడ్డంగా ఊపింది.

"కంపెనీ ఇస్తావా?" అన్నాడు ఆశగా.

"ఉఁహూఁ" చాలా స్పష్టంగా అంది తల ఊపకుండానే.

"అలవాటు లేదా! గుడ్. డోన్ట్ వర్రీ. నేనూ ఇప్పుడు తీసుకోనులే. పదినిముషాలాగి" అంటూ ఆమె కూర్చున్న సోఫా వెనగ్గా వచ్చి ఆమె రెండు భుజాల మీదా చేతులు వేసి గట్టిగా నొక్కాడు.

సావిత్రి లేచి నిలబడింది.

* * *

రాజారామ్ బాత్‌రూమ్‌లోకి వెళ్ళాడు. అప్పుడు ఎనిమిది గంటల ముప్ఫయి నిముషాలయింది.

సావిత్రి లేచి బాల్కనీలోకి వచ్చింది. రాజారాం సర్వం మరచి తన ఆనందాన్ని తను ఆస్వాదిస్తున్నా, పక్క గదిలో నుంచి ఉండి ఉండీ వినబడుతున్న ఆ స్త్రీ మూలుగులు బాకుల్లా గుండెలో గుచ్చుకుంటుండగా ఇక ఆగలేకపోయింది సావిత్రి.

రాజారామ్ బాత్‌రూమ్‌లోనుంచి తిరిగి వచ్చేలోగా ఒక్కసారి ఆ గదిలోకి తొంగి చూడాలన్నంత ఆత్రంగా బయటకు వచ్చింది. బయట చల్లటి గాలి శరీరాన్ని జివ్వుమనిపిస్తోంది.

రెండడుగులు ముందుకు వేసి దగ్గరకు వేసి ఉన్నట్లున్న పక్క గది తలుపును కొద్దిగా లోపలకు నెట్టింది. తెల్లటి వెలుగు. అంత పెద్ద గదిలో మధ్యగా ఓ మంచం. దాని మీద మెడవరకూ దుప్పటి కప్పుకు పడుకున్న ఓ స్త్రీ.

ఆమె ఎర్రగా ఉంది. ఆమె ముఖం అందంగా ఉంది. ఆమె నుదుట ఎర్రని కుంకుమ ఆమె అందాన్ని ద్విగుణీకృతం చేస్తోంది. ఆమె ఏదో బాధను భరించలేనట్లుగా నుదురు ముడివేసి అటూ ఇటూ కదులుతోంది.

బాత్‌రూమ్ తలుపు బోల్టు తీస్తున్నట్లనిపించగా, తలుపు దగ్గరకు లాగి, తను అంతవరకూ ఉన్న గది తలుపు ఎదురుగ్గా బాల్కనీలో నిల్చుంది బయటకు చూస్తూ.

రాజారామ్ తలుపు తీసుకు వస్తూనే, "బయట చలిగా లేదూ?" అన్నాడు.

"ఉఁహూఁ... చాలా వెచ్చగా ఉంది" అంది సావిత్రి, పక్క గదిలోని ఆమె కళ్ళముందు కదులుతుండగా.

ఆమె మాటలు అతడికి అర్థంగాకపోయినా పెద్దగా నవ్వాడు. "తలుపేసి అలా కూర్చో" అన్నాడు తనూ సోఫాలో కూర్చుంటూ.

అతడు 'డిప్లొమాట్' సీసామూత తీశాడు. గ్లాసులోకి వంచుకొని, కాసిని నీళ్ళు కలుపుకున్నాడు. ఆపైన ప్యాక్‌లో నుంచి రెండు ఐస్ క్యూబ్స్ తీసి గ్లాసులో వేసుకుంటూ, "జీడిపప్పు తీసుకో" అన్నాడు సావిత్రి వంక తాదాత్మ్యంగా చూస్తూ.

అతడు చాలా ఉల్లాసంగా ఉన్నాడు. "ఫైన్! జీవితాన్ని మనకిష్టమైన రుచికరమైన పదార్థాలతో ఎంజాయ్ చేయడం అంటే నాకు ఎంతో ఇష్టం!" అంటూ గ్లాసెత్తి చల్లటి బ్రాందీని కొద్దిగా చప్పరించాడు. ఓ జీడిపప్పు తీసుకొని నోట్లో సుతారంగా వేసుకొని, ప్లేటును సావిత్రి ముందుకు నెట్టాడు.

సావిత్రి తెచ్చిపెట్టుకున్న చిరునవ్వుతో ఎదురుగా కూర్చున్న అతడిని మత్తెక్కిస్తూనే ఉంది- అది తన వృత్తి ధర్మం అన్నట్లుగా.

తెరిచి ఉన్న బాల్కనీ తలుపు గుండా చల్లటి గాలిని పులుముకున్న ఆ బాధాతప్త స్వరం మరల వినబడింది, 'అమ్మా' అంటూ.

మెడ తిప్పింది సావిత్రి. ఒకసారి తనువులు కలిసిన తరువాత మరింత చనువేర్పడినట్లుగా సానునయంగా చూసింది అతడి వంక.

"ఈ ఇంటికి ఆ కేకలు మామూలే. వాటిని పట్టించుకోబోకు!"

"ఎవరది?"

"నా అర్థాంగి!" అంటూనే చేతిలోని గ్లాసెత్తి మిగిలి వున్నదంతా గడగడా తాగేశాడు.

"ఏమైంది?" అంది అతడివంక నిశితంగా చూస్తూ.

అతడు ఆమెనే చూస్తూ చిన్నగా నవ్వి, "డోన్ట్ వర్రీ. ఆమె లేచి రాలేదు!" అన్నాడు.

సావిత్రి తడబడింది. "ఆమె వస్తుందని కాదు. ఆమె ఎందుకలా బాధపడుతున్నదని?"

ఒక్క క్షణం నిశ్శబ్దంగా కూర్చున్నాడు. సీసా మూత తీసి తాపీగా మరల గ్లాసు నింపుకున్నాడు. రెండు ఐస్ క్యూబ్స్ వేసుకున్నాడు అందులో. తీసుకొని తాగబోతూ, "ఆమె బతకలేదు. చావలేదు. అది త్రిశంకు స్వర్గమో, నరకమో నాకు తెలియదు!" అన్నాడు ముఖంలో ఎలాంటి భావమూ వ్యక్తమవకుండా. తరువాత ఒక్క క్షణం గూడా ఆలస్యం చేయకుండా రెండు గుక్కలు తాగి, నాలుగు జీడిపప్పులు తీసి నోట్లో వేసుకొని నమలసాగాడు.

"ఆమెకేమైనా కావాల్సి పిలుస్తున్నదేమో?" అంది సావిత్రి జాలిగా.

"నెలకు రెండు వేలిచ్చి మనిషిని పెట్టాను. ఆవిడకు కావాల్సినవన్నీ అమర్చి ఏడుగంటలకు వెళ్ళిపోతుంది. మళ్ళీ ఉదయాన ఏడు గంటలకల్లా వస్తుంది."

"ఇంకేమైనా కావాలేమో? వెళ్ళి అడిగేదా?" అంది చిన్నగా.

"అనవసరమనుకుంటాను!"

సావిత్రి మాట్లాడలేదు. మౌనంగా, ఉండి ఉండి ఏదో పేరు తెలియని పిట్ట కూతలా వినబడుతున్న ఆమె మూలుగును వింటూ మనసులోనే మథనపడసాగింది.

"బాల్కనీ తలుపు వేస్తే మనం అన్నీ మరిచి పోవచ్చు!" అతడి కళ్ళు అప్పటికే ఎర్రటి చారలను ఏర్పరుచు కుంటున్నాయి.

అతడిని చూస్తూ భయం భయంగా, "నన్ను మీరు అంత దూరం తీసుకు వెళ్ళి దించాలి– గుర్తుందా?" అంది కాస్త నవ్వును కావాలని పెదిమలకు అంటించుకుంటూ.

అతడు పెద్దగా నవ్వాడు. "డోన్ట్ వర్రీ. ఈ సీసా మొత్తం తాగినా నా అంత జాగ్రత్తగా ఈ కారును ఈ ట్విన్ సిటీస్‌లో మరెవ్వరూ నడపలేరు" అన్నాడు.

ఆమెకు పక్క గదిలో నుంచి వినబడే రాజారామ్ భార్య మూలుగు వివశురాలిని చేస్తోంది. ఆమె మనసంతా వికారమవుతోంది. భరించలేని వేదన– సాటి స్త్రీ భర్త కౌగిట్లో ఆమె ఇంటిలోనే, ఆమె ఉండగానే నలిగిపోవడం అనే విషయం ఆమె గుండెల్ని తూట్లు పొడుస్తున్నట్లనిపిస్తోంది.

ఆలోచనల వలయాలలో గిరిగిరా తిరుగుతూ కూర్చున్న ఆమె వెనగ్గా అతడు ఎప్పుడు వచ్చి నిలబడ్డాడో ఆమె గమనించలేదు. అతడు ఆమె భుజంమీద చేయివేసి నొక్కినప్పుడు

సావిత్రి ఉలిక్కిపడి తలెత్తింది. కాంక్షతో విశాలమైన కళ్ళను అమె మీదకు గురిపెట్టి ఆమె ముఖం దగ్గరకు తన ముఖాన్ని చేరుస్తున్న అతడిని చూస్తూనే లేచి నిలబడింది.

ఆమెకు అర్థమైంది. మంచం దగ్గరకు బరువుగా అడుగులు వేయసాగింది.

* * *

"నేను ఇక వెళతాను!" అంది తలవంచుకొని లేచి నిలబడుతూ.

"రాత్రంతా ఉండలేవా?"

"ఈరోజు పదిగంటలకు నేను ఇంట్లో ఉండాలి" అంది దృఢంగా.

"ఇంకెవరికైనా కమిట్ అయ్యావా?" అతడు ఇబ్బందిగా, అనిష్టంగా అటూ ఇటూ కదులుతూ అడిగాడు.

ఆమె ముఖం నెత్తురుని ఎవరో పిండేసినట్లనిపించగా కళాహీనమైంది.

"లేదు."

"మరి?"

ఆమె నసుగుతున్నట్లుగా ఏదో గొణిగింది.

"ఓ.కే... ఓ.కే... డోన్ట్ వర్రీ. నీ పర్సనల్ విషయాలు అడగను. నేను దించి వస్తాను. ఓ.కే... పోనీలే రేపు రాత్రంతా ఉండగలవా?" ఆశగా చూశాడు సావిత్రి వైపుకు రాజారామ్.

ఆమె ఒక్కక్షణం ఆలోచిస్తున్నట్లుగా ఆగింది. "ప్రయత్నిస్తాను."

"దట్స్ గుడ్."

అతడు లేచాడు. "బయట చలికి తట్టుకునేందుకు గ్లాను డాలు, శిరస్త్రాణం ధరించి వస్తాను. ఫైవ్ మినిట్స్."

ఆమె చటుక్కున బయట బాల్కనీలోకి వచ్చేసింది.

ఒక్కక్షణం గూడా ఆలస్యం చేయలేదు. పక్క గది తలుపు దగ్గరకు వెళ్ళి చిన్నగా లోపలకు చేత్తో నెట్టింది. తెరుచుకున్న తలుపుగుండా మరే ఆలోచనా లేకుండా లోపల కాలుపెట్టింది.

మంచం మీద పడుకొని వున్న రాజారామ్ భార్య లోపలకు వచ్చిన సావిత్రిని చూసింది.

"నేను..." తడబడింది సావిత్రి.

ఆమె అంత బాధలోనూ విచిత్రంగా నవ్వింది ముఖం విశాలం చేసుకుంటూ. "ఇవ్వాళ కూతురుకు ఒంట్లో బాగోలేదని ఫోను చేస్తే పనిమనిషి సాయంత్రం అయిదు గంటలకే వెళ్ళిపోయింది. ఆ హడావుడిలో మంచినీళ్ళు పెట్టటం మరిచిపోయినట్లుంది. నేనా ఈ మంచం మీదనుంచి లేవలేను. నా నాలికైతే ఎండిపోతోంది. కాస్త దాహం తీర్చమ్మా!"

"ఫ్రిజ్‌లోవి ఇవ్వమంటారా?" అంది పక్కనే ఉన్న ఫ్రిజ్‌ను చూస్తూ.

"కాస్త విడినీళ్ళు కలిపి ఇస్తే బాగుంటుంది."

ఫ్రిజ్ తెరిచి, నీళ్ళ సీసా తీసి, పక్కనే ఉన్న బిందెలోనుంచి కాసిని నీళ్ళు తీసుకొని కలిపి, ఓ గ్లాసులో పోసి ఆమెకు ఇచ్చింది సావిత్రి.

"ఏమిటి మీ బాధ?"

మంచినీళ్ళు తాగి పేలవంగా నవ్వింది ఆమె. "ఒకటైతే చెప్పగలను. వందయితే ఏదని చెప్పగలను!"

ఒక్కక్షణం ఆమెనే తదేకంగా చూస్తూ, చాలా చిన్న గొంతుకతో, "నేను ఇలా రావటం మీకు బాధగా లేదా?" అంది.

"భోజనం వండి పెట్టలేనప్పుడు మగవాడు హోటళ్ళకు వెళుతున్నాడనీ, క్యారియర్లు తెచ్చుకొని సుష్టుగా భోజనం చేస్తున్నాడని ఏడ్వటం దేనికి? దేనికమ్మా బాధ. నాకు ఈ బాధనుంచి విముక్తి కలగడంలేదే అని బాధపడుతున్నాను. అంతే!" ఆమె మాటలు నీటిలో తడిసినట్లున్నాయి.

సావిత్రి ఇంకొక్క క్షణం ఆగలేదు. గిరుక్కున వెనక్కు తిరిగి బయటకు వచ్చేసింది.

"ఆవిడగారిని ఇంటర్వ్యూ చేసి వస్తున్నావా?" అన్నాడు రాజారామ్ చిన్నగా నవ్వుతూ. అప్పటికే చొక్కా, స్వెట్టర్ వేసుకున్నాడు. తలకు మంకీ క్యాప్ పెట్టుకున్నాడు.

సావిత్రి తడబడింది. "క్షమించాలి!"

"డోన్ట్ వర్రీ. ఆమె బాధ ఆమెది. నా బాధ నాది. నీ బాధ నీది. ఏం చేస్తాం చెప్పు!" అంటూ ఆమె చేతిలో ఓ కవరు పెట్టాడు.

దాన్ని ఆమె వ్యానిటీ బ్యాగ్‌లో పడేసి భుజానికి తగిలించుకుంది.

అతడు కిందకు నడవసాగాడు. ఆమె భుజం నిండా నలిగిన చీరను కప్పుకొని, రేగిన జుట్టును సరిచేసుకుంటూ అతడి వెనకాలే నడవసాగింది.

కారులో కూర్చుంటుంటే ఓ వేడి నిట్టూర్పు వెలువడింది అసంకల్పితంగా ఆమె నుండి.

కారు గేటు దాటి నిశ్శబ్దంగా చెట్లు కప్పివేసిన ఆ నల్లటి తారురోడ్డు మీద, అక్కడక్కడా తెల్లటి పొడల్లా ఉన్న దీపపు కాంతులను దాటుకుంటూ వెళుతోంది.

ఆమె గుండె చాలా బరువుగా ఉంది. కళ్ళముందు- రూపాయంత ఎర్రటి కుంకుమ బొట్టు పెట్టుకొని, ఎన్నో సంవత్సరాల క్రితం ఎండని చూసినట్లున్న పచ్చటి ముఖంతో, కదలలేక మెదలలేక, ఒక్కోసారి తాగేటందుకు ఒక్క గ్లాసెడు మంచినీళ్ళ కోసం గొంతు చించుకు ఏడ్చే ఆ మనిషంటే జాలివేస్తోంది సావిత్రికి.

ఆమె కళ్ళు మూసుకుంది. గట్టిగా మూసుకుంది. ఆ దృశ్యం కళ్ళల్లో నుంచి కనుమరుగవ్వాలన్నట్లుగా మరింత బలంగా మూసుకుంది.

"ఇప్పుడు ఎటు వెళ్ళాలో చెప్పు."

అతడి మాటలకు ఉలిక్కిపడి కళ్ళుతెరిచింది సావిత్రి. తన బస్తీ వచ్చేసింది. తన ఇంటికి దాపులో ఉన్న చౌరాస్తా వచ్చేసింది.

"కుడివైపుకు."

కారు చిన్న చిన్న డాబా ఇళ్ళముందుగా, గతుకుల రోడ్డుమీదగా ముందుకు వెళు తోంది. వీధి దీపాలు గుడ్డిగా ఉన్నాయి. ఇళ్ళ తలుపులన్నీ మూసి ఉండి, మనుషుల అలికిడే లేదు. ఉండి ఉండి ఎక్కడో కుక్కల అరుపులు.

"ఆ ఇంటి ముందు ఆపండి."

కారు ఆగుతుండగానే ఆమె దిగింది. కారు శబ్దానికి ఇంటి కిటికీ తలుపు తెరుచుకుంది.

"రేపు రాత్రి ఏడింటికి వచ్చి పికప్ చేసుకుంటాను. నాకిచ్చిన మాట మరిచిపోవద్దు. రాత్రంతా ఉండాలి. అవునూ, కవర్లో డబ్బు ఎంతుందో చూసుకున్నావా?"

"అక్కర్లేదు. ఎంతున్నా ఫరవాలేదు. ఒక్కసారి లోపలకు వచ్చి వెళ్ళగూడదూ?"

"దేనికి?"

"మా ఇంట్లోకి రావడంలో తప్పు లేదుగదా!" అంది చిన్నగా నవ్వుతూ- వంగి అద్దం కిందకు దించిన తలుపులో నుంచి అతడినే చూస్తూ.

ఆ చూపు, ఆ నవ్వు అతడిని కవ్విస్తున్నట్లున్నాయి. "ఛ ఛ! అదేం లేదు" అంటూ రాజారామ్ దిగాడు. ఆమెను చూస్తూ ఉండడం, ఆమెతో మాట్లాడుతూ ఉండడం అతడికి ఎంతో ఆనందాన్ని కలిగిస్తున్నాయి.

ఆమె ముందు వెళ్ళి దగ్గరకు వేసి ఉన్న తలుపులను లోపలకు నెట్టింది.

వెనగ్గా వచ్చిన అతడిని ఆ గదిలో ఉన్న కుర్చీలో కూర్చోమంది.

"నేను కాఫీల్లాంటివి ఏమీ తాగను."

'మీరు ఏం తాగుతారో నాకు తెలుసు' అన్నట్లుగా చిన్నగా నవ్వి తలూపి లోపలకు వెళ్ళింది.

ఆ ఇంటికి సున్నంకొట్టి చాలా రోజులైంది అన్నట్లుగా గోడల మీద మరకలు. తలుపులు లేని అలమరలో వాసన నూనె సీసాలు, పౌడరు డబ్బాలు, అలంకరణ సామాగ్రి. ఎదురుగ్గా రెండు దేవుడి క్యాలెండర్లు. స్విచ్‌బోర్డు పక్కగా వెలిగించిన సాంబ్రాణీ కడ్డీలు గుచ్చగా ఏర్పడిన నల్లటి పొగచారలు. ఇంటి కప్పుకు మూలల అంటివున్న బూజు. కప్పుకు మధ్యలో మడ్డి పట్టిన ఫ్యాను.

అలమరా పక్కగా పెద్ద మంచం. దానిమీద పరుపు. ఆ పరుపుపైన మాపు కనబడని ముదురు రంగు దుప్పటి. చిన్న టీపాయ్.

ఇనుప కుర్చీలో ఇబ్బందిగా అటూ ఇటూ కదులుతుండగా సావిత్రి లోపలనుంచి వచ్చింది. వెనుక ఓ మనిషి. సన్నగా, పొడుగ్గా ఉన్నాడు. బుగ్గలు సొట్టలు పడి, కళ్ళు గుంటలు పడి, గడ్డం పెరిగి, రోగిష్టివాడిలా ఉన్నాడు. మెడవరకూ ఓ పాత నల్లటి దుప్పటి కప్పుకున్నాడు.

"మా వారండీ!" అంది సావిత్రి ఆ గదిలోకి వస్తూనే వెనగ్గా ఉన్న వ్యక్తిని చూపించి రాజారామ్‌తో.

అతడు నమస్కారం పెట్టాడు చిరునవ్వు నవ్వి.

రాజారామ్ ఇబ్బందిగా కదిలాడు. లేచి నిల్చుంటూ, "నమస్కారం" అన్నాడు.

"వీరే మా కంపెనీ ప్రొప్రయిటర్. చాలా మంచివారు. త్వరలో నువ్వు కోలుకునేలా మన కెంతో సాయంచేస్తా నన్నారు. ఆఫీసులో పని ఎక్కువైతేనేం? అందుకే ఎంత

పొద్దుపోయినా పని పూర్తి చేసి వచ్చేది. కంపెనీ నుంచి మెడికల్ లోను ఇప్పిస్తున్నారు గూడా!"

అతడు మరోసారి నమస్కారం చేశాడు కృతజ్ఞతాపూర్వకంగా.

రాజారామ్ ఆమె అన్న మాటలకు 'కాదు' అనడం ఇష్టం లేదన్నట్లుగా, "ఓ.కే. ఓ.కే" అని, "మరి వస్తాను" అంటూ బయటకు అడుగులు వేశాడు.

సావిత్రి అతడి వెనుకే బయటకు వెళుతూ, "మీరు వెళ్ళి పడుకోండి. ఎక్కువ సేపు నిల్చుంటే నీరసం వస్తుంది. వారిని పంపించి వచ్చి హార్లిక్స్ కలిపి ఇస్తాను!" అంది.

రాజారామ్ బయటకు వచ్చాడు. కారు డోరు తీసి ఎక్కి కూర్చున్నాడు. వాళ్ళింటికి వచ్చి ఆమె భర్త ఎదుట నిలబడాలంటే ఏదో వెగటుగా ఉన్నట్లనిపించింది అతడికి.

"ఏమిటి ప్రాబ్లమ్ ఆయనకు?" అన్నాడు ఏదో అడగాలి అన్నట్లుగా.

"బ్లడ్ క్యాన్సర్!" అన్నది కనురెప్పలు వాలుస్తూ దిగులుగా. "ఆయన ట్రీట్‌మెంట్‌కే నా ఈ శ్రమంతా. నేను ఇలాంటి వ్యవహారాలు నడిపిస్తూ డబ్బు సంపాదిస్తున్నానని తెలిస్తే ఆయన ఎంతో బాధపడతారు. అందుకే మీ దగ్గర ఉద్యోగమని అబద్ధమాడాను. మీరు లోనిస్తారన్నాను. సారీ. ఆలాంటిదేమీ వద్దులేండి. డాక్టర్ల లెక్క ప్రకారం ఆయన ఇంకా ఆరు నెలలకు మించి బతకరు. అయినా చివరి క్షణంవరకూ ఆయనకు బతుకు మీద ఆశ కలిగించడం భార్యగా నా విధి. గుడ్ నైట్. రేపు ఏడింటికల్లా నేను రెడీగా ఉంటాను!" రెండు చేతులూ జోడించి నమస్కరిస్తూ అంది సావిత్రి.

అతడు ఇంజన్ స్టార్టు చేసి యాక్సిలిరేటర్‌ను బలంగా నొక్కాడు.

కారు వెళ్ళిన వైపే శూన్యంలోకి చూస్తున్నట్లుగా ఆ చీకట్లోకి చూస్తూ ఉండిపోయింది కాసేపు సావిత్రి.

మీద కప్పుకున్న దుప్పటిని కుర్చీలో పడేసి వెనుదిరిగి వస్తున్న సావిత్రికి ఎదురుగా నిలుచున్నాడు అతడు.

"బ్రోకరు ముండాకొడుకుని మొగుణ్ణి చేసి నాటకమాడుతున్నావ్. నా రోగానికంటూ ఆయన దగ్గర మరింత డబ్బు గుంజేయాలనా?" అన్నాడు నవ్వుతూ అతడు.

సావిత్రి మాట్లాడకుండా నవ్వి ఊరుకుంది.

"మంచి పార్టీలా ఉన్నాడు. కోడిని బాగా పోషించి గుడ్లు జాగ్రత్త చేసుకో!" అన్నాడు గారపట్టిన పళ్ళన్నీ బయట పెట్టి నవ్వుతూ.

అయినా సావిత్రి మాట్లాడలేదు. అతగాడి మాటలకు ఆమె కళ్ళు తడుస్తున్నాయి.

* * *

మరునాడు సాయంత్రం ఏడయ్యేటప్పటికి తయారై కూర్చుంది సావిత్రి ముందు గదిలో.

రాజారామ్ వస్తాడా? రాడా?

ఆదుర్దాగా రోడ్డువంకే చూస్తోంది. ఆమెకు అంతా అయోమయంగా ఉంది.

ఆమె ఉలిక్కిపడేలా దూరంగా కారు హారన్ చప్పుడు. ఆమెలో ఉద్విగ్నత పెరిగింది. అది రాజారామ్‌దేనా? గుండెల్లో తెలియని భయం, దిగులు, నిరాశ, నిస్పృహ.

కారు ఆమె ఇంటి ముందే ఆగడంతో ఆమె డీలా పడిపోయింది. ఆమె ముఖం రక్తహీనమైపోయింది. శిలలా ఆ కారు వంకే చూస్తూ ఉండిపోయింది కన్నార్పకుండా.

డ్రైవింగ్ సీట్లో నుంచి డ్రైవర్ దిగాడు. ఆత్రంగా వెనుక సీట్లోకి చూసింది. ఎవరూ లేరు. నిస్త్రాణగా ఉన్న ఆమె ప్రాణవాయువు అందినట్లుగా ఒక్కసారి ఊపిరి పీల్చుకున్నది.

తనను తీసుకు రమ్మనమని డ్రైవర్‌ను పంపాడా?

అతడు చిన్నగా లోపలకు వచ్చాడు.

"మీరు సావిత్రిగారేనా? మీకు మా సారు ఈ కవరు ఇమ్మన్నారు!"

త్వరత్వరగా అడుగులు ముందుకు వేసి అందుకుంది ఆ కవరును. మూసి ఉన్న దాన్ని చివర చించింది. అందులో ఓ ఉత్తరం, చెక్కు!

"డియర్ సావిత్రీ,

ముళ్ళ కంపల నడుమ చిక్కుకు పోయిన మనసును అతి సున్నితంగా బయటకు లాగావ్. నా బాధ్యతను నాకు వేలెత్తి చూపించావ్. థాంక్యూ. నేను వెంటనే నా భార్యను తీసుకొని ఆమె ట్రీట్‌మెంటుకు గాను అమెరికా వెళ్ళే ప్రయత్నంలో హడావుడిగా ఉన్నాను.

దీంతో నేను సంతకం చేసిన బ్లాంక్ చెక్కు పంపుతున్నాను. వెంటనే నీ భర్తను హాస్పిటల్‌లో చేర్పించు. అక్కడ ఎంత డబ్బు కావాలంటారో కనుక్కొని బ్యాంకునుంచి తెచ్చుకో. అల్ ది బెస్ట్.

– రాజారామ్."

ప్రయోగంలో విజయం సాధించినందుకు ఆమె కళ్ళు ఆనందంతో తళుక్కుమన్నాయి. ఆ సంతోషంలోనే ఆమె చేతి వేళ్ళు ఉత్తరం కిందగా ఉన్న చెక్కును ఉండలా చుట్టివేశాయి!

* * *

*(ఇండియా టుడే: 16.03.1999)*